# జనపదం
J A N A P A D H A M

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | బుధవారం 28 ఆగస్టు 2024 | సంచిక: 1 సంపుటి: 81




## ఆలయాలు అద్భుతం..

యాదాద్రికి మళ్లీ వస్తా..

కోటగుళ్లు కాకతీయ కళా సంపదకు సాక్ష్యాలు

రామప్ప శిల్ప సంపదకు నిలయం..

కాకతీయుల కట్టడాలను కాపాడుకోవాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ..

3



# అంటించారు.. మంటలే ఇక..?!

## వడ్డీతో సహా చెల్లిస్తాం..

- జగమొండిని చేశారు..
- కేసీఆర్ బిడ్డను తప్పు చేయను..
- రాజకీయ కక్షతోనే జైలుకు పంపారు..
- న్యాయపరంగా పోరాడుతా.. నిర్దోషిగా నిరూపించుకుంటా
- తీహార్ జైలు నుంచి బయటికి వచ్చిన ఎమ్మెల్సీ కవిత
- సంబురాలు చేసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు
- కొడుకు, భర్తను చూసి భావోద్వేగానికి లోనై..
- కవిత బెయిల్ చుట్టే రాజకీయం..
- అన్ని పార్టీలు పోటాపోటీ కామెంట్స్..

**పిల్లిని బంధించి కొట్టాలని చూస్తే తప్పకుండా పులిగా మారాల్సిన పరిస్థితి. పదేపదే సూక్ష్మంలో చూపాలని చూస్తే నిజంగా బరితెగించాల్సిన స్థితి. మంచిగా ఉంటే తీరు మరోలా ఉంటుంది., ముంచాలని చూస్తే ముమ్మాటికి మితిమీరేలాగే తయారవుతుంది. ఉసిగొల్పారు., ఇక విశృంఖలత్వం చవి చూడాల్సిందే. తట్టి లేపారు తప్పక ప్రతిఫలాన్ని చూడాల్సిందే. మంచితనమో., మెత్తదనమోగానీ మొండిత నమైతే అబ్బేలా.., తప్పు జరిగిందో, కక్షసాధింపోగానీ తెగించేలా ప్రేరేపణ. మునిగిన తర్వాత చలెక్కదుంటుంది., నింద పడిన తర్వాత ఎన్నిసార్లు అంటుకున్నా పోయేదేముంటది. అయినా తెల్ల చొక్కాకు మరక పడనంత వరకే కరుకుగా., ఒక్కసారి మట్టి అంటుకుంటే అది కాపాడుకోవాలనే ప్రయత్నం కూడా చేయం. జరుగుతున్న సత్యమిదే., నడుస్తున్న ట్రెండూ ఇదే.**

**జనపదం, బ్యూరో**

సుమారు 165 రోజులు. వివాదాలు.., విచారణలు. లోపల ఉన్న మనిషి చుట్టూ బయట విపరీత పోకడలు. అందరూ ఉన్న అనాథగా బాధను దిగమింగుకుంటూ, భారంగా రోజులు నెట్టుకొచ్చిన దయనీయమైన పరిస్థితులు. ఎట్టకేలకు సుప్రీం బెయిల్ మంజూరుతో అన్నింటికి ఫుల్ స్టాప్. కవిత బయటకు రావడంతో ఒక్కసారిగా ఉద్వేగానికి లోనైన కుటుంబ సభ్యులు, గులాబీ శ్రేణులు. సంబురాలు., స్వీట్ల పంపిణీలు. అదంతా ఒకవైపైతే పోటాపోటీగా పార్టీల కామెంట్లు. ఫైనల్ గా కవిత ఇచ్చిన స్టేట్ మెంట్స్ మరింత హైలైట్. "నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేసే ప్రసక్తే లేదు. నన్ను అనవసరంగా జైలుకు పంపి జగమొండిని చేశారు. 18 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా. ఎన్నో ఎత్తుపల్లాలు చూశా. పిల్లలను వదిలి ఐదున్నర నెలలు జైల్లో ఉండడం అనేది ఇబ్బందికరమైన విషయం. ఇలాంటి ఇబ్బందులకు గురిచేసిన వారికి తప్పకుండా వడ్డీతో సహా చెల్లిస్తాం. సమయం వస్తది.. తప్పకుండా చెల్లిస్తాం." అంటూ కవిత ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆమెకు ......(తరువాయి 2లో)

## కవితకు బెయిల్

ఐదు నెలల తర్వాత వీడిన చెరసాల

సుదీర్ఘంగా సాగిన వాదనలు

ఢిల్లీ హైకోర్టు తీర్పును తప్పు పట్టిన సుప్రీం కోర్టు..

పలు కండిషన్ల విధింపు.. (-స్పెషల్ పేజీలో)



## బెయిల్ పై ట్విట్టర్ వార్..

సుప్రీంకోర్టుకు ధన్యవాదాలన్న కేటీఆర్

ఇది బీఆర్ఎస్-కాంగ్రెస్ విజయమంటూ బండి సెటైర్..

బండి ట్వీట్ పై కేటీఆర్ ఫైర్

కోర్టు ధిక్కారంగా భావించాలంటూ పోస్ట్..

3






## గోషామహల్ లో కొత్త 'ఉస్మానియా'

- 32 ఎకరాల్లో ఆస్పత్రి ఏర్పాటు
- 50 ఏళ్ల ముందుచూపుతో డిజైన్లు
- ప్రస్తుత భవనానికి చారిత్రక కట్టడ సొబగులు
- 22 జిల్లాల్లో సమాఖ్య భవనాలకు ఎకరం స్థలం
- ఏడాదిలోపు కొత్తగా 15 నర్సింగ్ కాలేజీ భవనాలు
- స్పీడ్ సమీక్షలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి

2

## 'ఆర్ఆర్ఆర్'కు తొలగనున్న అడ్డంకులు



ఉత్తర భాగానికి వీడనున్న చిక్కుముళ్లు

ఫారెస్ట్ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్

ప్రత్యామ్నాయంగా మరో చోట భూమి కేటాయింపు

సెప్టెంబర్ చివరి వారంలోగా భూ సేకరణ

3



# నో నోటీస్.. ఓన్లీ డిస్మెటల్

- నో సెకండ్ థాట్.. ఎవరైనా హైడ్రాకు ఒక్కటే..
- చెరువులు ఆక్రమిస్తే కూల్చివేతే..
- స్పష్టం చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- కమిషనర్ కు భద్రత పెంచిన సర్కార్..
- ఇంటి వద్ద ఇద్దరు సెక్యూరిటీతో ఔట్ పోస్ట్ ఏర్పాటు

**జనపదం, హైదరాబాద్ క్రైం:**

హైడ్రా ఈ పదం రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారింది. కూల్చివేతలు తీవ్ర చర్చగా మారాయి. ఈ నేపథ్యంగా హైడ్రా చర్యలపై, నిర్ణయాలపై ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రాపై వస్తున్న ఆరోపణలుకు క్లారిటీ ఇచ్చారు. రాజకీయ చదరంగంలో హైడ్రా పావుగా మారదల్చుకోవడం లేదన్నారు. చెరువు ఎఫ్టీఎల్ ఆక్రమించి కళాశాలలు నిర్మించే యాజమాన్యాలపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అయితే అందులో చదివే విద్యార్థుల భవిష్యత్ ను రోడ్డున పడేయకుండా ఆయా కళాశాలల యాజమాన్యానికి కొంత సమయం ఇస్తామని రంగనాథ్ తెలిపారు. ఓవైసీ అయినా.. మల్లారెడ్డి అయినా.. పల్లా రాజేశ్వర్ రెడ్డి అయినా.. ఎవరైనా హైడ్రాకు ఒక్కటేనని స్పష్టం చేశారు. చెరువులు, నాళాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఏమాత్రం ఆలోచించకుండా వాటిని కూల్చివేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. పార్టీలకు అతీతంగా మా చర్యలు ఉంటాయని, ధర్మ సత్రమైనా ఎఫ్టీఎల్‌లో ఉంటే కూల్చేస్తామని పేర్కొన్నారు. హైడ్రా ......(తరువాయి 2లో)



4

## ఐసీసీ నూతన అధ్యక్షుడిగా షా..

ఏకగ్రీవంగా ఎన్నిక..

అతిపిన్న వయస్కుడిగా రికార్డు

## స్కూళ్లలో స్పోర్ట్స్ పీరియడ్

- తప్పనిసరిగా ఉండేలా చర్యలు
- క్రీడలకు నిధుల కొరత లేదు..
- క్రీడా నగరంగా హైదరాబాద్ ను చేస్తాం
- ప్రసిద్ధ క్రీడా పోటీల నిర్వహణకు సిద్ధం
- స్పోర్ట్స్ యూనివర్సిటీతో పెరగనున్న తెలంగాణ ప్రాతినిధ్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3



## నిర్ణయమా..? నిర్లక్ష్యమా..!

- రాజముద్రను మార్చి గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్
- ఎక్స్ వేదికగా కేటీఆర్ ఫైర్..
- కొత్త చిహ్నాన్ని ఎవరూ ఆమోదించారంటూ ప్రశ్న..

జనపదం, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఘోర తప్పిదాని పాల్పడ్డారు. ఏకంగా రాష్ట్ర రాజముద్రనే మార్చేశారు. దీనిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఇది అధికారిక నిర్ణయమా లేక అనధికార నిర్లక్ష్యమా ఎక్స్ వేదికగా మండిపడ్డారు. అసలు ఏం జరుగుతుందో కనీసం మీకైనా తెలుసా అంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వ చిహ్నాలైన కాకతీయ తోరణం, చార్మినార్‌లతో ఈ వెకిలి పనులు ఏంటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ లేని రాజముద్రతో గ్రేటర్




వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇది.. ఈ కొత్త చిహ్నం ఎవరు, ఎప్పుడు ఆమోదించారంటూ పోస్ట్ చేశారు. దీనికి కారకులెవరో కనుక్కొని వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజముద్ర మార్పు ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకావడంతో వెంటనే అధికారులు మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇక బల్దియా కమిషనర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులకు మెమోలు జారీ చేశారు.

## ఫుల్ హెల్త్ ప్రొఫైల్..

- అందరికీ హెల్త్ కార్డులు
- ఫ్రాన్స్ విధానాన్ని పరిశీలించాలని సూచన
- 17 నుంచి ఊరూరా ప్రజా పాలన
- పది రోజుల పాటు కార్యక్రమం
- రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- ఏర్పాట్లు చేయాలని ఆదేశం..

2

# ఫుల్ హెల్త్ ప్రొఫైల్..

- అందరికీ హెల్త్ కార్డులు
- ఫ్రాన్స్ విధానాన్ని పరిశీలించాలని సూచన
- 17 నుంచి ఊరూరా ప్రజా పాలన
- పది రోజుల పాటు కార్యక్రమం
- రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- ఏర్పాట్లు చేయాలని ఆదేశం..



**జనపదం, హైదరాబాద్:** ప్రజాపాలనకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 17 నుంచి పది రోజుల పాటు ఊరురా కార్యక్రమం నిర్వహించాలని సీఎం ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసేందుకు ఈసారి ప్రజాపాలన చేపట్టనున్నట్లు చెప్పారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రజా పాలనలో ప్రతీ కుటుంబం నుంచి అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రమంతటా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ను నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి.., గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? అంశాలను వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్ లో ఉత్తమమైన విధానం అనుసరిస్తున్నారని ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు.

## సీజనల్ వ్యాధులపై ఆందోళన..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగీ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కలెక్టర్ సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు, పంచాయతీ రాజ్ అధికారులు సీజనల్ వ్యాధులపై వెంటనే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, పలు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రాజ్యసభ ఉప ఎన్నికలు ఏకగ్రీవం

- 12 మంది సభ్యుల ఎన్నిక
- తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ



**జనపదం, ఢిల్లీ:** రాజ్యసభ ఉప ఎన్నికల్లో 12 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 రాజ్యసభ స్థానాలకు ఈ నెల 21వరకు నామినేషన్లు స్వీకరించగా, తొమ్మిది స్థానాల్లో బీజేపీ, రెండు స్థానాల్లో ఆ పార్టీ మిత్రపక్షాలైన ఎన్సీపీ, ఆర్ఎల్ఎం అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరోవైపు, తెలంగాణ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్డీఏ ఎగువ సభలో మెజార్టీ మార్కును అందుకుంది. తాజాగా రాజ్యసభలో బీజేపీ బలం 96కి చేరగా, మిత్రపక్షాలతో కలిపి ఎన్డీఏ ఆ బలం 112గా ఉంది. దీనికితోడు అధికార పార్టీకి ఆరుగురు నామినేటెడ్, ఒక స్వతంత్ర సభ్యుడి మద్దతు కూడా ఉంది. తాజాగా కాంగ్రెస్ నుంచి ఒక సభ్యుడు గెలుపొందడం వల్ల రాజ్యసభలో ప్రతిపక్షాల బలం 85కి పెరిగింది.

## తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ

రాజ్యసభ అభ్యర్థిత్వానికి తెలంగాణ నుంచి రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీటిలో కాంగ్రెస్ నుంచి అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ వేయగా, రెండోది స్వతంత్ర అభ్యర్థిగా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు బలపరచకపోవడంతో పద్మరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది. దీంతో అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నిక అయ్యారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## కాంగ్రెస్‌లో సింఘ్వీ ప్రస్థానం

అభిషేక్ సింఘ్వీ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. 2001 నుంచి కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. 2006, 2018లో రెండు దఫాలు రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీ చేసి బీజేపీ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో ఆయనను తెలంగాణ నుంచి పోటీ చేయించాలని ఏఐసీసీ నిర్ణయించింది. అయితే తెలంగాణలో రాజ్యసభ సభ్యత్వం కోసం స్థానిక నాయకులు కొందరు ప్రయత్నించారు. కానీ జాతీయ రాజకీయాల్లో సింఘ్వీ సేవలు కాంగ్రెస్‌కు కీలకమైనందున ఆయనకే అధిష్ఠానం అవకాశం ఇచ్చింది.

# నో నోటీస్.. ఓన్లీ డిస్మెటల్

(మొదటిపేజీ తరువాయి) ఎవ్వరికి నోటీసులు ఇవ్వదని.. డైరెక్ట్ కూల్చివేతలే చేస్తుందని తనదైన శైలిలో చెప్పుకొచ్చారు. తమకు అందరూ సమానమేనని స్పష్టం చేశారు.

## వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

హైదరాబాద్ మహానగరంలో చెరువుల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయాలనికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదుదారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు వరుస కడుతున్నారు. దీంతో హైడ్రా కార్యాలయానికి తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. మొదట పదుల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులు హైడ్రా కఠిన చర్యలతో వందల్లో పెరుగుతున్నాయి. వాటన్నింటిని స్వీకరిస్తున్న హైడ్రా కార్యాలయ సిబ్బంది అందులోని వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. తాజాగా జీహెచ్ఎంసీలోని పలువురు బీజేపీ కార్పొరేటర్లు బుద్ధభవన్‌లో ఉన్న హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను కలిసి చెరువులు, పార్కుల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. ఇక ఫిర్యాదుదారుల తాకిడి పెరగడంతో హైడ్రా కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు పెంచారు.

## భద్రత పెంపు

హైడ్రా కమిషనర్ ఐపీఎస్ ఏవీ రంగనాథ్ కూల్చివేతల విషయంలో సంచలన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏవీ రంగనాథ్‌కు భద్రత పెంచింది. రంగానాథ్ ఇంటి దగ్గర పోలీసులు భద్రత పెంచారు. మధురానగర్ కాలనీ డీ-81లోని ఆయన ఇంటి వద్ద ఇద్దరు సెక్యూరిటీతో కూడిన ఔట్ పోస్టు కూడా ఏర్పాటు చేశారు. అక్రమ కట్టడాల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేసిన నేపథ్యంలో రంగనాథ్‌కు ఏమైనా ముప్పు ఏర్పడవచ్చనే అనుమానంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేసింది.

# నేటి నుంచి వర్షాలు..

**జనపదం, బ్యూరో:** రాష్ట్రంలో కొన్ని రోజులుగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పట్లో వర్షాలు తెలంగాణను వీడేలా కనిపించడం లేదు. రాష్ట్రంలో మరో ఆరు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా బుధవారం నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. తూర్పు మధ్య పరిసర ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని.. దీని ప్రభావంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు.

# అంటించారు.. మంటలే ఇక..?!

**జనపదం, ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత విడుదలయ్యారు. ఐదున్నర నెలల తర్వాత.. విడుదలైన కవితకు స్వాగతం పలికేందుకు తీహార్ జైలు వద్దకు ఆమె కుటుంబ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జైలు నుంచి పిడికిలి బిగించి బయటకు వచ్చిన కవిత.. జై తెలంగాణ అంటూ నినాదం చేశారు. అనంతరం తన కొడుకు చూసి గట్టిగా హత్తుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఆ తర్వాత భర్తను, అన్నయ్య కేటీఆర్ ను కూడా హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు.

## మొండిని చేశారు..

ఐదున్నర నెలల తర్వాత మీ అందరినీ మళ్లీ కలుసుకున్నందుకు ఆనందంగా ఉందని, 18 ఏళ్ల రాజకీయంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని కవిత చెపపారు. తనను అనవసరంగా జైలులో పెట్టి ఇబ్బంది పెట్టినందుకు వాళ్లు కచ్చితంగా మూల్యం చెల్లించుకుంటారు. వడ్డీతో సహా తిరిగి ఇచ్చేస్తానని పేర్కొన్నారు. ఐదున్నర నెలల పాటు ఓ తల్లిగా పిల్లలకు, కుటుంబానికి దూరంగా ఉండటం ఎంతో ఇబ్బందికరమైన విషయమన్నారు. నేను మొండిదాన్ని. అనవసరంగా నన్ను జగమొండిగా మార్చారని పేర్కొంది. తనను, తన కుటుంబాన్ని ఎంతో ఇబ్బంది పెట్టారని, వారందరికీ సరైన సమాధానం చెబుతానని, ఆ సమయం త్వరలోనే వస్తుందని ఆ శాభావం వ్యక్తం చేశారు. ఇటువంటి కష్ట సమయంలో తనకు, తన కుటుంబానికి అండగా ఉన్న వాళ్లందరికీ కృతజ్ఞతలు తెలిపార. తాను తెలంగాణ బిడ్డను, కేసీఆర్ బిడ్డనని, తప్పు చేసే ప్రసక్తే లేదన్నారు. తాను మొండిదాన్ని, మంచిదాన్ని.. అనవసరంగా జైలుకు పంపించి నన్ను జగమొండిగా మార్చారని, తాము ఫైటర్స్. న్యాయంగా పోరాడతామని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో ఇంకా గట్టిగా పోరాడతామని, కమిట్మెంట్‌తో పని చేస్తామని చెప్పారు. చట్టబద్ధంగానే కాకుండా రాజకీయ పరంగానూ పోరాడతామని, బీఆర్ఎస్ అండ్ కేటీఆర్ టీం అన్ బ్రోకబుల్ అని పేర్కొంది.

## రాత్రి 9.12కు విడుదల..

తీహార్ జైలు నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంగళవారం రాత్రి 9:12 గంటలకు విడుదలయ్యారు. కవిత జైలు నుంచి బయటకు రాగానే అక్కడే ఉన్న తన కొడుకును ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. ఆ తర్వాత భర్త అనిల్, అన్నయ్య కేటీఆర్‌ను గుండెలకు హత్తుకున్నారు. ఈ సమయంలో హరీశ్‌రావు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. దాదాపు 165 రోజుల తర్వాత ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు.

## వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం..



(మొదటిపేజీ తరువాయి) దాదాపు 5 నెలల అనంతరం మంగళవారం బెయిల్ వచ్చింది. సాయంత్రం తీహార్ జైలు నుంచి బయటికి రాగానే కవిత.. పిడికిలి బిగించి జై తెలంగాణ నినాదాలు చేశారు. అక్కడే ఉన్న భర్త అనిల్, అన్నయ్య కేటీఆర్, కుమారుడిని గుండెలకు హత్తుకుని భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. తాను తెలంగాణ బిడ్డను.. కేసీఆర్ బిడ్డను. తప్పు చేసే ప్రసక్తే లేదని, నేను మొండిదాన్ని.. మంచిదాన్ని. నన్ను అనవసరంగా జైలుకు పంపి జగమొండిని చేశారని పేర్కొంది. రాజకీయ కక్షలో భాగంగానే నన్ను జైలుకు పంపారని, న్యాయపరంగా, రాజకీయంగా పోరాడుతానని, నిర్దోషిగా నిరూపించుకుంటానని స్పష్టం చేసింది. ప్రజాక్షేత్రంలో ఇంకా గట్టిగా పని చేస్తానని, కమిట్‌మెంట్‌తో పని చేస్తానని పేర్కొంది.

## నేటి మధ్యాహ్నం హైదరాబాద్‌కు

బెయిల్ పై విడుదలైన కవిత రాత్రికి ఆమె ఢిల్లీలోనే బస చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం ట్రయల్ కోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో.. హాజరైన అనంతరం.. హైదరాబాద్‌కు బయలుదేరనున్నట్టు తెలుస్తోంది. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, కేటీఆర్, హరీష్ రావు రానున్నారు. ఇక రేపు ఉదయం బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టే అవకాశం ఉంది.

## శ్రేణుల సంబురాలు..

కవిత విడుదల సందర్భంగా జైలు దగ్గరికి వచ్చిన బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు.. బాణాసంచా కాల్చి ఆమెను స్వాగతం పలికారు. జై తెలంగాణ, జై కేసీఆర్, జై కవిత నినాదాలతో హోరెత్తించారు. కాగా.. తన కోసం వచ్చిన అభిమానులు, కార్యకర్తలందరికీ కవిత పాదాభివందనం తెలిపారు.



# భారీగా డ్రగ్స్ పట్టివేత..

### రూ. 1.87 కోట్ల విలువైన హాషీష్ ఆయిల్, గంజాయి స్వాధీనం

**జనపదం, క్రైమ్:** ఏపీ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్‌ను తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను భువనగిరి ఎస్ఓటీ, పోచంపల్లి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. అల్లూరి సీతారామారాజు జిల్లాకు చెందిన గమ్మెలి గోవిందరావు, కొర్ర రమేశ్‌బాబు స్థానికంగా చంటి, లక్ష్మీనాయుడు వద్ద ఈ నెల 26న 10.2 కిలోల హాషఆయిలి కొని ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు వచ్చి కొత్తగూడ ఎక్స్‌రోడ్డులో దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గోవిందరావు, రమేశ్‌బాబును అరెస్ట్ చేసి, రూ. 1.52 కోట్ల విలువైన 10.2 కిలోల హాషీష్‌ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు.

## గంజాయి స్మగ్లింగ్ చేస్తూ..

మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన వాల్మీక్, దేవారాం ఏపీలోని విశాఖపట్టణంలో తిరుపతితో కలిసి 25న పెందుర్తిలో 60 కిలోల గంజాయి కొని కారులో మహారాష్ట్రకు బయలుదేరారు. మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు ఇబ్రహీంపట్నం మండలం రైపోల్‌పరిధిలో తనిఖీ చేయగా రూ. 35 లక్షల విలువైన 60 కిలోల గంజాయి ప్యాకెట్లు లభించగా నిందితులను అరెస్ట్ చేశారు.


# ఉద్యోగం ఊస్ట్..

- అవినీతికి పాల్పడితే సర్వీస నుంచి ఔట్
- సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి

**జనపదం, హైదరాబాద్ :** విధి నిర్వహణలో లంచాలు, నిందితులకు కొమ్ము కాయడం, కేసు పక్కదారి పట్టించే పోలీసులను సస్పెన్షన్ తో సరిపెట్టకుండా శాశ్వతంగా ఉద్యోగం ఊడగొడతామని సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్ పోలీసులపై అవినీతి ఆరోపణలు రావడంతో సీపీ స్పందించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల నుంచి లంచాలు, వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ మరోసారి స్పష్టం చేశారు. పోలీసులు అవినీతికి పాల్పడినట్టు రుజువైతే ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని తేల్చి చెప్పారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ తీరు మారని, పద్ధతి మార్చుకోని పోలీసు అధికారులపై మరింత నిఘా పెడతామని వివరించారు. నగరంలోని మసాజ్ సెంటర్లు, చిరు వ్యాపారులు, పాన్ షాపుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడొద్దని పోలీసులకు సీపీ సూచించారు. అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి సర్వీస్ నుంచి తొలగిస్తామని సీపీ వార్నింగ్ ఇచ్చారు. ఇక అవినీతి కేసులలో సస్పెండ్ చేయడం అంటూ ఉండదని, సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

# చేపల వేటకు వెళ్లి ముగ్గురి దుర్మరణం

### మృతులది ఒకే కుటుంబం



**జనపదం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పొచ్చర వాగులో చేపల వేటకు వెళ్లి ముగ్గురు యువకుల గల్లంతవగా ఒకరి మృతదేహం లభ్యమైంది. మిగతా ఇద్దరి కోసం పోలీసులు, స్థానిక జాలరులు గాలింపు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన కూలీలు ఆకాష్, అక్షయ్, విజయ్ అనే ముగ్గురు ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం బండల్నాగాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉంటున్నారు. మంగళవారం ఆకాష్ , విజయ్ తమ బంధువైన శ్రీనివాస్‌తో కలిసి ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర వాగులో చేపల పట్టడానికి వెళ్లారు. చేపలు పడుతుండగా శ్రీనివాస్ వాగులో పడిపోయాడు. ఆయనను రక్షించేందుకు ఆకాష్, విజయ్‌లు ప్రయత్నించే క్రమంలో వారు సైతం నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీస్, డీడీఆర్ఎఫ్ బృందాలు స్థానిక జాలర్లతో కలిసి గాలింపు చర్యలు చేపట్టాగా విజయ్ మృతదేహం లభ్యమైంది. మిగతా ఇద్దరి కోసం వాగులో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అంతా ఒకే కుటుంబం వారు కావడంతో సభ్యుల రోదనలు మిన్నంటాయి.

# లిమ్స్ ఆస్పత్రిలో నర్సుపై డాక్టర్ లైంగిక వేధింపులు

**జనపదం, రంగారెడ్డి :** పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం ఘటన మరువకముందే మరో ట్రైనీ డాక్టర్‌పై లైంగిక వేధింపులకు పాల్పిడిన ఘటన కలకలం రేపుతుంది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గూడూరు గేట్ కొత్తూరు సమీపంలోని లిమ్స్ ఆస్పత్రిలో నర్స్ పై ఓ వైద్యుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. డాక్టర్ వేధింపులు భరించలేని బాధితురాలు మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి డాక్టర్ మార్కండేయులను నిలదీసేందుకు ఆస్పత్రికి వెళ్లింది. దీనిపై బాధితురాలు కందుకూరు పోలీసులకు సమాచారం అందించడంతో డాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హాస్పిటల్ కి ఎలాంటి పర్మిషన్ లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా హాస్పిటల్ పెట్టి తన దగ్గర పనిచేసే పేదింటి మహిళలను వేధిస్తున్నారని ఆరోపించారు. ఇంతకు ముందు కూడా డాక్టర్ మార్కండేయులు ఇలా చేయగా హైదరాబాద్ నుంచి తరిమికొట్టారని అన్నారు. ఒకరోజు క్రితం తనను లైగింక వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు యాజమాన్యానికి ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఇలాంటి హాస్పిటల్ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించి హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గోషామహల్‌లో కొత్త ఉస్మానియా

- 32 ఎకరాల్లో ఆస్పత్రి ఏర్పాటు
- 50 ఏళ్ల ముందుచూపుతో డిజైన్ చేయాలి
- ప్రస్తుత భవనానికి చారిత్రక కట్టడ సొబగులు
- పేట్లబురుజుకు పోలీస్ స్టేడియం..
- 22 జిల్లాల్లో సమాఖ్య భవనాలకు ఎకరం స్థలం
- ఏడాదిలోపు కొత్తగా 15 నర్సింగ్ కాలేజీ భవనాలు

**స్పీడ్ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి**



**జనపదం, సిటీ బ్యూరో:** హైదరాబాద్‌లోని గోషామహల్ లో ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మాణానికి అవసరమైన కార్యచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోషామహల్ లోని పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు దాదాపు 32 ఎకరాల స్థలం ఉంది. ప్రస్తుతం పోలీస్ విభాగం అధ్వర్యంలో ఉన్న ఈ స్థలాన్ని వెంటనే వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడే ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని చెప్పా రు. రాష్ట్ర ప్రభుత్వం అత్యం త ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణం, 15 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 కొత్త పారామెడికల్ కాలేజీలు, జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలపై సీఎం సమీక్షించారు.

## 50ఏళ్లకు అనుగుణంగా..

రాబోయే 50 ఏళ్ల అవసరాలను అంచనా వేసుకొని, కొత్త ఆసుపత్రి నిర్మాణ డిజైన్లు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడికి చేరుకునే కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని, ఆసుపత్రి చుట్టూ రోడ్డు ఉండేలా డిజైన్ చేయాలని చెప్పారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకాడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలని ఆదేశించారు. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, సేవలన్నీ అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు. కేవలం కాంక్రీట్ భవంతులు, బహుళ అంతస్తులు కాకుండా ఆహ్లాదకరమైన విశాలమైన ఖాళీ ప్రాంగణం ఎక్కువగా ఉండేలా డిజైన్లు ఉండాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్స్‌లతో డిజైన్లను తయారు చేయించాలని అన్నారు. ఇప్పుడున్న ఉస్మానియా హాస్పిటల్ భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షించే బాధ్యతను చేపడుతామని ముఖ్యమంత్రి చెప్పారు. మూసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా అక్కడున్న భవనాలను పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక భవనాలుగా తీర్చి దిద్దుతామని అన్నారు.

## పేట్ల బుర్జుకు పోలీస్ స్టేడియం

గోషామహల్ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించినందుకు పోలీసు విభాగానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. పేట్ల బుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ, చుట్టూ ఉన్న స్థలాన్ని పరిశీలించాలని కలెక్టర్ ను ఆదేశించారు. ఇప్పుడు గోషామహల్ లో ఉన్న పోలీస్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అక్కడికి తరలించేలా చూడాలని చెప్పారు.

## వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలి..

రాష్ట్రంలో కొత్తగా నిర్మించే ఆసుపత్రుల పనులను వేగవంతం చేయాలని, 15 నర్సింగ్ కాలేజీ భవనాలను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అందుకు వీలుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచే నర్సింగ్ కాలేజీలను ప్రారంభించాలని, తాత్కాలికంగా అద్దె భవనాల్లో వీటిని నిర్వహించే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇప్పటికే పది జిల్లాల్లో సమాఖ్య భవనాలున్నాయని, మిగతా 22 జిల్లాల్లో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఒక్కో జిల్లాలో సమాఖ్య భవనాలకు ఒక ఎకరం స్థలం కేటాయించేందుకు అంగీకరించారు. హైదరాబాద్ లోని శిల్పారామం పక్కనే మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని వెంటనే ఆ విభాగానికి బదిలీ చేయాలని సీఎం ఆదేశించారు. మహిళా శక్తి సంఘాలు తయారు చేసే తమ ఉత్పత్తులతో అక్కడ ఏడాది పొడవునా వివిధ స్టాళ్లు నిర్వహించేలా భారీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, అధికారులు పాల్గొన్నారు.



## వచ్చే నెల నుంచి కులగణన

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్..
- పార్టీ పరంగా అమలు చేస్తాం..
- మంత్రి పొన్నం ప్రభాకర్

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో వచ్చే నెల నుంచి కులగణన ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాహుల్ గాంధీ ప్రకటన ప్రకారంగా బీసీ కులగణనపై ఇటీవల అసెంబ్లీలో తీర్మానించినట్లు చెప్పారు. ఇందు కోసం ప్రత్యేకంగా జీవో జారీ చేసి రూ.150 కోట్లు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. సాధారణ పరిపాలన విభాగం, పంచాయతీరాజ్, ప్రణాళిక శాఖలలో ఏదైనా ఒక శాఖ ఈ ప్రక్రియను చేపడుతుందని చెప్పారు. వచ్చే నెల తొలి వారంలోనే కులగణన ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు బీసీ కులగణనపై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని వెల్లడించారు. బీసీలకు రిజర్వేషన్లు ఖరారైన మేరకు చట్టం చేసి అమలు చేస్తామన్నారు. ఇక స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దన్న కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉందని అన్నారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపు ఎంతమేరకు ఖరారైతే అంతవరకు చట్టం చేసి అమలు చేస్తామని అన్నారు. తెలంగాణలో బీసీల జనాభా అధికంగా ఉండటంతో వారికి రాజకీయంగా ఎక్కువ అవకాశాలు కల్పించాలి కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పరంగా మాత్రం బీసీ సంఘాలు కోరిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.





# ఆలయాలు అద్భుతం..

- యాదాద్రికి మళ్లీ వస్తా..
- కోటగుళ్లు , రామప్ప కళా సంపదకు సాక్ష్యాలు
- కాకతీయుల కట్టడాలను కాపాడుకోవాలి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ..

**జనపదం, నెట్ వర్క్:** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆలయాల పర్యటన చేపట్టారు. ఇందు లో భాగంగా మంగళవారం యాదాద్రి నృసింహుడిని దర్శించుకున్నారు. గవర్నర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏ ర్పాట్లు చేశారు. తర్వాత గవర్నర్‌కు ఆలయ అ ర్చకు లు వేదాశీర్వచనం అందించగా, అధికారులు స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. యాదాద్రి ఓ అద్భుతమని, ఆలయంలో తాను మంచి అనుభవాన్ని పొందానని, మళ్లీ తప్ప కుండా వచ్చి దర్శించుకుంటానని తెలిపారు. ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు.

**కోటగుళ్లు అద్భుతం..**

అక్కడి నుంచి గవర్నర్ నేరుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల గణపేశ్వరాలయాన్ని సందర్శించారు. పోలీసులతో గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్ కు వేదపండితులు పూర్ణ కుంభం, మేళా తాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర, మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట రావులతో కలిసి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గణపేశ్వరుడికి ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అనంతరం గణపేశ్వరాల యం ఆవరణలో తవ్వకాలలో బయల్పడిన శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మా ట్లాడు తూ.. కాకతీయుల వైభవాన్ని చాటే గొప్ప కట్టడం గణపేశ్వరాలయం అని, సుమారు 12వ శతా బ్దంలో కాకతీయులు ఓరుగల్లు ప్రాంతాన్ని పాలించిన సమయంలో ప్రజల సౌకర్యార్థం అద్భుతమైన కట్టడాలను నిర్మించారని అన్నారు.

**రామప్ప శిల్ప సంపద రమణీయం**

రామప్ప దేవాలయం మహాద్భుత కట్టడమని, దేవాలయ శిల్ప సంపద రమణీయంగా, ఆకర్షణీయంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. రామప్ప దేవాలయానికి చేరుకున్న గవర్నర్ కు ఆలయ ప్రాంగణంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. దేవాలయ వేద పండితులు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు సంప్రదాయాల వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. రుద్రేశ్వరుడిని దర్శించుకుని గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రొఫెసర్ పాండురంగారావు రా మప్ప దేవాలయం ప్రత్యేక విశిష్టత అయిన నీటిపై తేలియాడే ఇటుకను ప్రత్యేకంగా గవర్నర్ కు వివరించారు. ఆలయ చరిత్ర, శిల్పసంపద రమణీయత ఆలయ గైడ్ వివరించారు. అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ కట్టడం, చరిత్ర, శిల్ప సంపద, ఎంతో రమణీయంగా ఉందని దేవాలయాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం రామప్ప హరిత కాటేజ్ లను, సరస్సును సందర్శించారు. అక్కడి నుంచి లక్నవరం వెళ్లిన ఆయన అక్కడే రాత్రి బస చేశారు.



## స్కూళ్లలో స్పోర్ట్స్ పీరియడ్

- తప్పనిసరిగా ఉండేలా చర్యలు
- క్రీడలకు నిధుల కొరత లేదు..
- స్పోర్ట్స్ సిటీగా హైదరాబాద్ ను చేస్తాం
- ప్రసిద్ధ క్రీడా పోటీల నిర్వహణకు సిద్ధం
- స్పోర్ట్స్ యూనివర్సిటీతో పెరగనున్న రాష్ట్ర ప్రాతినిధ్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జనపదం, హైదరాబాద్ :** ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో తప్పనిసరిగా ఒక స్పోర్ట్స్ పీరియడ్ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్ర పంచ స్థాయిలోనే తెలంగాణ నుంచి అద్భుతమైన క్రీడాకారులు తయారు కావాలని జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో తెలంగాణకు ప్రాధాన్యం పెరిగేలా కృషి చేస్తామని అన్నారు. ప్రపంచ స్థాయి క్రీడా పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం పెరిగేలా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రసిద్ధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని నిర్వహణ కోసం అవకాశం ఇవ్వాలని ఇటీవలే కేంద్ర క్రీడాశాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. క్రీడలకు నిధుల కొరత లేదని, అవసరాలకు తగిన విధంగా నిధులు కేటాయిస్తామన్నారు. క్రీడల ద్వారా వచ్చే స్ఫూర్తి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తగిన శారీరక శ్రమను ఇచ్చే క్రీడలు లేక విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలుగా మారుతున్నారని, చిన్నప్పటి నుంచే వారిని శారీరక శ్రమను ఇచ్చే క్రీడలకు సంసిద్ధం చేసే దిశగా పాఠశాలలు కృషి చేయాలన్నారు. గత పాలకుల నుంచి వచ్చిన క్రీడా సముదాయాలను, ఆస్తులను మరమ్మతులు చేసి అభివృద్ధి చేయబోతున్నట్లు వెల్లడించారు. ఇందు కోసం అవసరమైతే క్రీడా ఉపాధ్యాయ పోస్టులను పెంచుతామని అన్నారు.



## మట్టి విగ్రహాలు ప్రోత్సహించాలి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- గణేష్ ఉత్సవాలపై అధికారులతో సమీక్ష

**జనపదం, హైదరాబాద్ :** మట్టి వినాయక విగ్రహాలు వినియోగించి సహకరించాలని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి పోలీస్, ఫైర్, హెల్త్, జీహెచ్ఎంసీకి సంబంధించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలను ఎంతో వైభవంగా జరుపుకుంటామన్నారు. వివిధ ఉత్సవ కమిటీలకు సంబంధించి నిర్వాహకులు గతంలో ఎదుర్కొన్న చిన్న చిన్న ఇబ్బందులను మా దృష్టికి తెచ్చారని, వాటిని పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్, కరెంట్ ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించామన్నారు. అందరినీ కలుపుకొని ఈ ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించామని, అందరు సహకరించాలని కోరారు. పొల్యూషన్ ను దృష్టిలో పెట్టుకుని మట్టి విగ్రహాలు పెట్టేలా ప్రోత్సహించాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా అందరికీ మట్టి విగ్రహాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు మట్టి విగ్రహాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై పెద్ద ఎత్తున క్యాంపెయిన్ చేయాలని నిర్ణయించామన్నారు. మట్టి విగ్రహాలు వినియోగించి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 'ఆర్ ఆర్ ఆర్'కు తొలగనున్న అడ్డంకులు

- ఉత్తర భాగానికి వీడనున్న చిక్కుముళ్లు
- ఫారెస్ట్ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్
- ప్రత్యామ్నాయంగా మరో చోట భూమి కేటాయింపు
- సెప్టెంబర్ చివరి వారంలోగా భూ సేకరణ




**జనపదం, బ్యూరో :** రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని తెలంగాణ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగు రోడ్డు గతంలోనే ఉండగా.. ఓఆర్ఆర్ నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రంలో సగభాగం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం చెబుతోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ఈ రహదారిని నిర్మిస్తుండగా.. ప్రాజెక్ట్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలిగిపోతున్నాయి.

**అటవీశాఖ గ్రీన్ సిగ్నల్..**

రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి అటవీశాఖ అభ్యంతరాలు పరిష్కారం కానున్నాయి. ఉత్తర భాగం రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించేందుకు ఆ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి ప్రత్యామ్నాయంగా మరో చోట భూమి కేటాయించేందుకు రెవెన్యూశాఖ కసరత్తు చేపట్టగా అది కూడా త్వరలోనే కొలిక్కి రానుంది. రీజినల్ రింగు రోడ్డు మొత్తం పొడవు 350 కిలోమీటర్లు కాగా.. ఇందులో ఉత్తర భాగం సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి–భువనగిరి జిల్లాల మీదుగా నిర్మించనున్నారు. దీని పొడవు 161.59 కిలోమీటర్లు. ఈ నాలుగు జిల్లాల పరిధిలో రహదారి నిర్మాణానికి 4,697 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది.


**అభ్యంతరాలు లేవు..**

మెదక్, యాదాద్రి జిల్లాల్లో కొందరు రైతుల నుంచి వ్యతిరేక వ్యక్తమైంది. ఇవి మినహా మిగిలిన చోట్ల ఎలాంటి అభ్యంతరాలు లేవని ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. రైతులకు నష్టపరిహారం అంచనాలను వచ్చే నెల చివరి నాటికి సిద్ధం చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ భూ సేకరణకు అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించనున్నాయి. దీంతో భూసేకరణ కోసం రాష్ట్ర వాటా కింద రేవంత్ సర్కార్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,525 కోట్లను బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. రహదారి నిర్మాణ వ్యయాన్ని మాత్రం పూర్తిగా కేంద్రమే భరించనుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇక ఉత్తర భాగంలో అటవీశాఖకు చెందిన సుమారు 79.32 హెక్టార్ల భూమి తీసుకోవాల్సి ఉంటుంది. యాదాద్రి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఈ అటవీ భూములు ఉన్నాయి. ఈ భూములను ఆర్ఆర్ఆర్ నిర్మాణం కోసం తీసుకోనుండగా.. ఆయా భూములకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన భూములను అటవీ అధికారులు త్వరలో పరిశీలించనున్నారు. ఈ కేటాయింపు ప్రక్రియను వచ్చే నెల చివరి వారంలోగా పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు.

## బెయిల్ పై ట్విట్టర్ వార్..

- సుప్రీంకోర్టుకు ధన్యవాదాలన్న కేటీఆర్
- ఇది బీఆర్ఎస్-కాంగ్రెస్ విజయమంటూ బండి సెటైర్..
- బండి ట్వీట్ పై కేటీఆర్ ఫైర్
- కోర్టు ధిక్కారంగా భావించాలంటూ పోస్ట్..





**జనపదం, బ్యూరో :** ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితకు మంగళవారం బెయిల్ వచ్చింది. ఈ నేపథ్యంలో బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్రమంత్రి బండి సంజయ్‌మధ్య ఎక్స్ వేదికగా ట్వీట్స్‌వార్ నడిచింది. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు అని కేటీఆర్‌పేర్కొనగా, కవితకు బెయిల్‌రావడం బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటికీ విజయమని బండి సంజయ్‌విమర్శించారు. అయితే బండి వ్యాఖ్యలపై కేటీఆర్‌మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌రావడంతో కేటీఆర్‌సుప్రీం కోర్టుకు ధన్యవాదాలని, చివరి న్యాయం గెలిచిందని ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉపశమనం లభించిందని కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. కాగా, కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే.. బీఆర్ఎస్ సపోర్ట్ కారణంగా ఒకరు రాజ్యసభలో స్థానం పొందారంటూ పేర్కొన్నారు. కవిత బెయిల్ కోసం తొలుత వాదనలు వినిపించిన లాయర్‌కు కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సీటు వ చ్చేలా కేసీఆర్ రాజకీయ చతురత ప్రదర్శించారంటూ ఆయన చేసిన ట్వీట్ చే శారు. వైన్ అండ్ డైన్ క్రైమ్ లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కంగ్రాట్యులేషన్స్ అంటూ బండి పేర్కొన్నారు. అయితే బాధ్యతాయుతమైన హోం శాఖ సహాయమంత్రిగా ఉన్న బండి సుప్రీం కోర్టు తీర్పుపై ఇలా స్పందించడమేంటని కేటీఆర్ నిలదీశారు. ఆయన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని, కోర్టు ధిక్కారంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.



## సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం అభినందనీయం

- ఓవైసీ బ్రదర్స్‌కు భయపడొద్దు
- ఎమ్మెల్యే రాజాసింగ్
- ముఖ్యమంత్రి రేవంత్‌కు మద్దతు

**జనపదం, హైదరాబాద్ :** చెరువులను కాపాడాలని సీఎం సంకల్పం తీసుకోవటం అభినందనీయమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కొనియాడారు. ఆయన సంకల్పం పూర్తి కావాలని తాను కోరుకుంటున్నానని ఆయన వెల్లడించారు. వేల మంది యువత మద్దతు ఉందని అక్బరుద్దీన్ బెదిరిస్తున్నారని, ఓవైసీ బ్రదర్స్ బెదిరింపులకు భయపడొద్దని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాదిరి భయపడకుండా రేవంత్ రెడ్డి ముందుకెళ్లాలని సూచించారు. ఓవైసీ బ్రదర్స్‌ను బొక్కలో వేసిన సీఎంగా కిరణ్ కుమార్ రెడ్డికి పేరుందని గుర్తుచేశారు. ఉచిత విద్య పేరుతో ఓవైసీ సోదరులు కోట్ల రూపాయలను దోచుకుంటున్నారని ఆరోపించారు. చెరువులో 12 ఎకరాలు ఆక్రమించి ఫాతిమా కాలేజ్ ను నిర్మించారని, అసదుద్దీన్ ఓవైసీ బంగ్లా కూడా ప్రభుత్వ స్థలంలోనే ఉందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంఐఎంకు గులాంగిరి చేసిందని విమర్శించారు.

# కోల్‌కతాలో టెన్షన్.. టెన్షన్..

- హత్యాచార ఘటనపై నిరసనలు ఉధృతం
- ఉద్రిక్తంగా విద్యార్థుల ఆందోళన
- 12 గంటల బెంగాల్ బంద్ కు బీజేపీ పిలుపు



**జనపదం, కోల్ కత్తా :** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ పై హత్యాచార ఘటనపై నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ మంగళవారం నిరసన చేపట్టింది. నబన్నా హౌవ్ నుంచి విద్యార్థులు ర్యాలీని ప్రారంభించారు. అయితే, వీరిని పోలీసులు అడ్డుకోవడంతో హావాలోని సంతర్గాచి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మార్చ్ లో పాల్గొన్న ఆందోళనకారులు బారికేడ్లను బద్దలుకొట్టేందుకు ప్రయత్నించారు. కొన్నింటిని లాగి పడేశారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వీరిపై బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ర్యాలీ నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. పోలీసులు లాఠీఛార్జ్ చేసినప్పటికి , భాష్పవాయువు ప్రయోగించినప్పటికి ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదు. హౌరా బ్రిడ్జి దగ్గర బైఠాయించారు. ప్రస్తుతం హౌరా బ్రిడ్జిపై విద్యార్థులు ధర్నా కొనసాగిస్తున్నారు. అయితే ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి.

**విద్యార్థుల అరెస్టు..**

మార్చ్ జరిగే సమయంలో హింసకు పాల్పడేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ నలుగురు విద్యార్థులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఆ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ విద్యార్థులు అర్ధరాత్రి సమయంలో అదృశ్యమయ్యారని బీజేపీ నేత సువేందు అధికారి ఆరోపించారు. విద్యార్థులు మిస్ అయ్యారంటూ కొందరు రాజకీయ నేతలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని బెంగాల్ పోలీసులు ఎక్స్ వేదికగా స్పందించారు. ఎవరూ అదృశ్యం కాలేదన్నది నిజమని తెలిపారు. దీనికి సువేందు బదులిస్తూ.. "ఆ విద్యార్థుల కుటుంబాలు హైకోర్టును ఆశ్రయించాయి. మమతా పోలీస్.. కోర్టులో కలుద్దాం" అని పోస్టు పెట్టారు.

**పకడ్బందీ చర్యలు**

పశ్చిమ బెంగాల్ లో విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కోల్ కతా పోలీసు విభాగం 6 వేల మందిని మోహరించింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 26 జిల్లాల కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించింది. మార్చ్ నేపథ్యంలో ప్రజాజీవితానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. నబన్నా (సచివాలయం) ర్యాలీ భాజపా– ఆర్ఎస్ఎస్ ప్రేరేపితమని వామపక్ష నాయకురాలు బృందాకారత్ తీవ్ర విమర్శలు చేశారు.

**12 గంటల బెంగాల్ బంద్**

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా బుధవారం 12 గంటల బెంగాల్ బంద్ కు బీజేపీ పిలుపునిచ్చింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ బంద్ జరుపనున్నట్టు తెలిపింది. మంగళవారం జరిగిన 'నబన్నా అభియాన్' ర్యాలీలో చెలరేగిన హింసాకాండకు మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వాన్ని రాష్ట్ర బీజేపీ నేత సువేందు అధికారి తప్పుపట్టారు. బెంగాల్ నిరసనలకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## కొనసాగుతున్న కాళేశ్వరం కమిషన్ ఎంక్వైరీ

- ఇంజినీర్ల పొంతన లేని సమాధానాలు
- జస్టిస్ చంద్రఘోష్ సీరియస్
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు అధికారుల వెల్లడి

**జనపదం, హైదరాబాద్ :** కాళేశ్వరం కమిషన్ ఓపెన్ కోర్టు విచారణ కొనసాగుతుండగా, సీడీవో తాజా, మాజీ ఇంజినీర్లు హాజరయ్యారు. బ్యారేజీల డిజైన్ల అప్రూవల్ పొందిన తర్వాత.. మార్పులు ఏమైనా జరిగాయా..? అప్రూవల్ చేసే ముందు, తర్వాత నిబంధనలు పా టించారా అని కమిషన్ ప్రశ్నించగా, ఇంజినీర్లు పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఇంజినీర్ల సమాధానాలపై జస్టిస్ చంద్రఘోష్ సీరియస్ అయ్యారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యల వల్ల జరిగింది అన్నట్లు మిషన్ ముందు ఇంజినీర్లు చెప్పారు. సిఖెండ్ ఫైల్స్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చింది అన్నట్లు ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. డిజైన్ల అప్రూవల్ తర్వాత అన్నారం గ్యారేజీ మోడిఫికేషన్ జరిగిందని కమిషన్‌ముందు ఇంజినీర్ ఒప్పుకున్నారు. అయితే రామగుండం ఈసీ లేఖ పై మాత్రం కమిషన్ ముందు ఇంజినీర్ దయాకర్ రెడ్డి స్పష్టత లేని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. హై పవర్ కమిటీలో సీడీఓ అధికారులు సభ్యులుగా ఉన్నారని ఇంజినీర్లు ఒప్పుకున్నారు. డిజైన్లు తయారు చేసే ముందు సైట్ విజిట్ ఖచ్చితంగా చేయనక్కర్లేదు అని కమిషన్ ముందు వారు చెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు కమిషన్‌కు అధికారులు చెప్పారు. అయితే మేడిగడ్డ లొకేషన్ మారలేదని తాజా మాజీ ఇంజినీర్లు.. కమిషన్ ముందు స్పష్టం చేశారు. సీడీఓ– ఎల్అండ్‌టీ వేరువేరుగా డిజైన్లు తయారుచేసి ఫైనల్ అప్రూవల్‌కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు ఇంజినీర్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమేఉన్నాయని ఇంజనీర్లు వెల్లడించారు. మరోవైపు మాజీ జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వి.ప్రకాష్ బీఆర్‌కే భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రఘు, వేధిర్ శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారని తెలిపారు. తాను కమిషన్ ముందు అఫిడవిట్ దాఖ లు చేశానన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం సాధ్యం కాదు అని వివరాలు ఇచ్చి నట్లు తెలిపారు. తుమ్మడిహెట్టిపై కాగ్ ఆక్షేపాలను కమిషన్‌కు తెలియజేసినట్లు చెప్పారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్ళీ పిలుస్తామని కమిషన్ అన్నదన్నారు. నిజమైన దోషులకు శిక్ష పడాలి అనేదే తమ ఉద్దేశమని వి.ప్రకాష్ పేర్కొన్నారు.


Read Share Follow janapadam @janapadam #janapadam




# హైదరాబాద్ ను మిస్ అవుతున్నా..

## డేవిడ్ వార్నర్

**జనపదం, స్పోర్ట్స్:** ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ కు భారత దేశంతో విడదీయలేని అనుబంధం ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ తో కోట్లాది మందికి చేరువైన డేవిడ్ భాయ్‌కు తెలుగు నేల అంటే ఎనలేనిన ప్రేమ. ముఖ్యంగా హైదరాబాద్ అంటే చెప్పలేనంత ఇష్టం. ఆ ఇష్టాన్ని వార్నర్ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా బయటపెట్టాడు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో చారిత్రక కట్టడమైన చార్మినార్ ఫొటో పెట్టిన అతడు 'నా ఫేవరెట్ ప్రదేశాన్నిమిస్ అవుతున్నా' అంటూ క్యాప్షన్ రాశాడు. దీంతో ఆ పోస్ట్ చూసిన వాళ్లంతా నిజమే.. డేవిడ్ భాయ్‌కు హైదరాబాద్‌తో ఉన్న అనుబంధం మర్చిపోలేనిది అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఐపీఎల్‌లో ఓపెనర్‌గా, కెప్టెన్‌గా వార్నర్ హిట్ కొట్టాడు. అంతేకాదు సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 2016లో డేవిడ్ భాయ్ చాంపియన్‌గా నిలిపాడు. ఆ తర్వాత ఫ్రాంచైజీతో పొసగక అతడు వేలానికి వెళ్లాడు. ప్రస్తుతం వార్నర్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడుతున్నాడు. మైదానంలో వార్నర్ ఆడుతుంటే ఎంత మజా ఉంటుందో.. అతడి ఇన్‌స్టాగ్రామ్, టిక్ టాక్ వీడియోలు కూడా అంతే మజాగా ఉంటాయి.

# అభిమానికి పంత్ సాయం..

## తిరిగి ఇచ్చేస్తానన్న అభిమాని

**జనపదం, స్పోర్ట్స్:** టీమ్ఇండియా స్టార్ ప్లేయర్ రిషబ్ పంత్‌ని ఆర్థిక సాయం చేయాలని ఆయన అభిమాని కోరాడు. ఇంజినీరింగ్ కోర్సు చేయడానికి క్రౌడ్ ఫండింగ్‌లో సాయం చేయాలని ప్రముఖ సోషల్ మీడియా వేదిక ట్విట్టర్‌లో పంత్‌ను ట్యాగ్ చేస్తూ అడిగాడు. దీనికి పంత్ కూడా రెస్పాండ్ అయ్యి సాయం చేశాడు. అయితే సోషల్ మీడియాలో పలువురు నెటిజన్లు ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జాతీయ స్థాయి ఆటగాడిని మోసం చేయడానికి సిగ్గు లేదా?' అంటూ అతడిపై ట్రోల్ చేశారు. దీంతోపంత్ ఇచ్చిన డబ్బును తాను తిరిగి చెల్లిస్తానని సదరు అభిమాని ప్రకటించాడు. 'ఇంత ద్వేషాన్ని భరించలేను. కెట్టోలో రిఫండ్ చేసే అవకాశం లేదు. వాళ్లకు మెయిల్ చేశాను. అనుమతి రాగానే ఆ డబ్బును తిరిగి ఇచ్చేస్తాను. క్షమించండి!' అని 'ఎక్స్' వేదికగా పోస్టు చేశాడు.

# 16ఏళ్ల టెన్నిస్ స్టార్..

## బోణి కొట్టిన ఇవా జోవిక్



జనపదం, స్పోర్ట్స్: ప్రపంచ టెన్నిస్‌లో అమెరికాది ప్రత్యేక స్థానం. ఆ దేశం నుంచి ఎందరో మహిళా టెన్నిస్ స్టార్లు పుట్టుకొచ్చారు. విలియమ్స్ సిస్టర్స్ తర్వాత టీనేజర్ కొకో గాఫ్ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లలో అమెరికా పేరును గట్టిగా వినిపించేలా చేశారు. ఇప్పుడు వీళ్ల అడుగు జాడల్లోనే ఓ టీనేజర్ దూసుకొస్తోంది. ప్రతిష్టాత్మక యూఎస్ ఓపెన్ 2024లో అమెరికా యువకెరటం ఇవా జోవిక్ బోణి కొట్టింది. పదహారేండ్ల వయసులోనే తొలి విజయాన్ని రుచి చూసింది. తద్వారా 24 ఏండ్ల తర్వాత ఈ టోర్నీ మెయిన్ డ్రాలో గెలుపొందిన తొలి అమెరికన్‌గా జోవిక్ చరిత్ర సృష్టించింది. అరంగేట్రం గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో విజేతగా నిలిచిని ఈ యంగ్‌స్టర్ అమెరికా భావి టెన్నిస్ తారగా ప్రశంసలు అందుకుంటోంది. యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో జోవిక్ అదరగొట్టింది. పోలాండ్‌కు చెందిన మగ్ద లినెట్టెను 6-4, 6-3తో చిత్తుగా ఓడించింది. గంట 28 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన జోవిక్ ప్రత్యర్థిని అలవోకగా మట్టికరిపించింది. ఈ విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లిన ఆమె టెన్నిస్ ప్రస్థానం ఆద్యంతం ఆసక్తికరం. యూఎస్ ఓపెన్‌లో ఈ యంగ్‌స్టర్ వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించింది.



# మహిళ జట్టు ఫిక్స్..

**జనపదం, స్పోర్ట్స్:** ప్రతిష్టాత్మక ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా బీసీసీఐ ఈ టోర్నీకి సంబంధించిన పూర్తి షెడ్యూల్ అలాగే జట్టు సభ్యులను ప్రకటించింది. యూఏఈ వేదికగా అక్టోబరు 3 నుంచి 20 వరకూ జరగనుంది. 15 మందితో కూడిన మహిళల జట్టు ఈ టోర్నీలో పాల్గొననుండగా, వికెట్‌కీపర్ యాస్తికా భాటియా, ఆల్‌రౌండర్ శ్రేయంకా పాటిల్ మాత్రం ఫిట్‌నెస్ సాధిస్తేనే యూఏఈకి వెళ్తారు. ఇక తనుజా కన్వర్, ఉమా ఛెత్రి, సైమా ఠాకూర్‌ను ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపిక చేశారు. ప్రపంచ కప్ బంగ్లాదేశ్‌లో జరగాల్సి ఉండగా.. అక్కడ జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో ఈ టోర్నీని యూఏఈకి షిఫ్ట్ చేశారు.

**భారత తుది జట్టు**
హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, ఆశా శోభన, అరుంధతి రెడ్డి, యాస్తికా భాటియా, పుజా వస్త్రాకర్, రేణుకా సింగ్, షఫాలీ వర్మ, హేమలత, రాధా యాదవ్, శ్రేయంకా పాటిల్, సంజనా సంజీవన్.

**భారత్ షెడ్యూల్ ఇదే**
అక్టోబర్ 4న భారత్ x న్యూజిలాండ్ మ్యాచ్ జరగనుండగా, ఆ తర్వాత 9న శ్రీలంక, 13న ఆస్ట్రేలియాతో టీమ్ఇండియా మహిళల జట్టు తలపడనుంది. ఇక చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాక్ అక్టోబర్ 6న దుబాయ్‌లో ఆడనున్నారు. మరోవైపు అక్టోబర్ 17, 18న జరగనున్న సెమీ ఫైనల్స్‌తో పాటు 20న జరిగే ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంది. ఇక భారత్ ఒకవేళ సెమీస్‌కు చేరితే అప్పుడు తొలి సెమీ ఫైనల్‌లో మన జట్టు తలపడనుంది.

# ఐసీసీ నూతన అధ్యక్షుడిగా షా..

## ఏకగ్రీవంగా ఎన్నిక.. అతిపిన్న వయస్కుడిగా రికార్డు



**జనపదం, స్పోర్ట్స్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి సెక్రటరీ జై షా ఐసీసీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అందరూ ఊహించినట్టగానే ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవంగా చైర్మన్ పదవికి ఎంపికయ్యాడు. తద్వారా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు చైర్మన్ అయిన అతి పిన్న వయస్కుడి(35ఏండ్లు)గా షా చరిత్ర సృష్టించాడు. ప్రస్తుత అధ్యక్షుడు గ్రెగ్ బార్‌క్లే స్థానంలో.. 2024, డిసెంబర్ 1న నూతన చైర్మన్‌గా జై షా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఐసీసీ చైర్మన్‌గా నామినేట్ అవ్వడంపై షా సంతోషం వ్యక్తం చేశాడు. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నాడు. క్రికెట్‌లోని ఫార్మాట్ల మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూసేందుకు అవసరమైతే సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తానని, ఇదివరకూ లేనంతగా క్రికెట్‌ను అంతటా విస్తరింపచేయడమే లక్ష్యమని చెప్పారు. 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడం ఈ ఆట అభివృద్ధి పరంగా గొప్ప విప్లవాత్మకమైన నిర్ణయమన్నారు. దీంతో క్రికెట్ మరింత పురోగతి చెందుతుందనే నమ్మకం ఉందని షా వెల్లడించాడు.

**బీసీసీఐ కార్యదర్శిగా..**
షా 2019 అక్టోబర్‌లో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. అప్పటి నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నాడు. 2021 జనవరి నుంచి ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గానూ షా సేవలందిస్తున్నాడు. ఇప్పుడు ఆయన ఐసీసీ చైర్మన్‌గా ఎంపికైన నేపథ్యంలో తదుపరి బీసీసీఐ సెక్రటరీ ఎవరు? ఏసీసీ చైర్మన్ అయ్యేది ఎవరు? అనేది ఆసక్తికరంగా మారింది.

## CINEMA NEWS సినిమా పదం

# నవ్వు.. రౌద్రం..

టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్‌తోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు సినిమాల్లో ఒకటి దేవర. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జూనియర్ ఎన్టీఆర్ టైటిల్‌లో రోల్‌లో నటిస్తున్నాడు. దేవర రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్27 న గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టిన టీం.. ఫియర్, చుట్టమల్లె సాంగ్స్ లాంచ్ చేయగా నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతున్నాయి. తాజాగా మేకర్స్ కొత్త లుక్ షేర్ చేశారు. భయం ముఖ చిత్రాలు.. అంటూ తారక్ కొంచెం నవ్వు.. మరికొంచెం రౌద్రరూపంలో కనిపిస్తూ గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాడు. ఇప్పుడీ పోస్టర్ నెట్టింట ట్రెండింగ్ అవుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఒక నెలలో బిగ్ స్క్రీన్‌పైకి దేవర రాక.. ఆ అనుభూతి ప్రపంచాన్ని కదిలిస్తుంది. సెప్టెంబర్ 27న థియేటర్లలో దేవర మ్యాడ్‌నెస్‌ని అనుభవిద్దాం.. అంటూ రిలీజ్ చేసిన లుక్ నెట్టింటిని షేక్ చేస్తోంది.






# మా నాన్న సూపర్ హీరో

తన సినిమా సినిమాకి కొత్తగా ట్రై చేస్తూ వస్తున్న నవ దళపతి సుధీర్ బాబు. మరి రీసెంట్ గా "హరోం హర" సినిమాతో పలకరించాడు. దర్శకుడు జ్ఞాన సాగర్ ద్వారకా తెరకెక్కించిన ఈ చిత్రం అనుకున్న రేంజ్ హిట్ కాలేదు. తాజాగా ఆయన హీరోగా వస్తునన మూవీ "మా నాన్న సూపర్ హీరో". ఓటీటీలో సూపర్ హిట్ అయ్యిన వెబ్ సిరీస్ "లూజర్" దర్శకుడు అభిలాష్ కంకర తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై డీసెంట్ బజ్ ఉంది. ఇప్పుడు మేకర్స్ దీనిపై ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టుకున్నట్టుగా కన్ఫర్మ్ చేయగా దసరా బరిలో మూవీని ఉంచుతున్నట్టుగా తెలిపారు. అలాగే రిలీజ్ డేట్ ని అతి త్వరలోనే అనౌన్స్ చేస్తున్నట్టుగా తెలిపారు.


# ఓటీటీలోకి లాల్ సలామ్..

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం లాల్‌సలామ్. ఐశ్వర్య రజినీకాంత్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఫిబ్రవరి 9న భారీ అంచనాల మధ్య రిలీజ్ కాగా.. ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. సినిమా థియేటర్లలోకి వచ్చి ఆరు నెలలు దాటింది. ఈ క్రమంలో మూవీ ఓటీటీ బాటపట్టింది. సన్‌నెక్ట్స్‌లో ప్రీమియర్ కానున్నట్టు ఇన్‌సైడ్ టాక్. సెప్టెంబర్ 20 నుంచి లాల్ సలామ్ సన్ నెక్ట్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుండగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ మూవీని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరణ్ తెరకెక్కించగా.. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.




# నోట్ల కట్టల మధ్య జిమ్ సర్బ్

డైరెక్టర్ శేఖర్ కమ్ముల ఈ సారి రూటు మార్చి కుబేర సినిమాతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నాడు. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న చిత్రం కుబేర. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నాడు. ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది.. అంటూ చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో ధనుష్ నవ్వుతూ కనిపిస్తున్న లుక్‌ను షేర్ చేయగా.. ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై అంచనాలు పెంచుతోంది. తాజాగా ఈ చిత్రంలో కీ రోల్ చేస్తున్న పాపులర్ బాలీవుడ్ యాక్టర్ జిమ్ సర్బ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆయన పాత్ర లుక్ షేర్ చేశారు. స్టైలిష్ సూట్‌లో నోట్ల కట్టల మధ్య నిల్చున్న పోస్టర్ కుబేర సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తోంది. సోషల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్న డ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు.






# రుక్సార్.. అదిరెన్..

హీరోయిన్ రుక్సార్ ధిల్లన్ అంటే అందానికి నిలువెత్తు రూపం. 'రన్ ఆంటోనీ' అనే కన్నడ మూవీతో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన రుక్సార్ ..తెలుగులో న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన కృష్ణార్జున యుద్ధం సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది. ఆ తర్వాత అల్లు శిరీష్ నటించిన ఏబీసీడీ సినిమాలో గ్లామర్ పాత్రలో కనిపించి మెప్పించింది. అందాల ఆరబోత.. అభినయంలోనూ బెస్ట్‌గా ఉన్న ఈ చిన్నదానికి తెలుగులో పెద్దగా అవకాశాలు రాలేదు. అయితేనేం తెలుగు అభిమానుల కోసం సోషల్ మీడియా వేదికగా అలరిస్తోంది. హాట్ ఫిక్స్ తో సెగలు రేపుతోంది. అభిమానులు తనను ఫాలో అయ్యేలా చేసుకుంటోంది.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com



# బాపు మౌనం వీడేనా..?


- **ఇన్నాళ్ల మౌనం.. నేటి తీర్పేనా.. !**
- **ఇక కేసీఆర్ మార్క్ రాజకీయాలే అంటూ చర్చ**

జనపదం, బ్యూరో: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల్లో ఓటమి నాటి నుంచి మౌనంగా ఉంటున్నారు. ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవితను జైల్లో ఉండడం, ఇటు అధికారం కోల్పోవడంతో సైలెంట్ అయ్యారు. గతంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన భావోద్వేగానికి గురయ్యారు. కన్న కూతురు జైల్లో ఉంటే నాకు బాధ ఉండదా? అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఆ వెంటనే ఆయన కన్నీళ్లు పెట్టుకున్నంత పని చేశారు. కవిత అరెస్ట్ ప్రభావం కేసీఆర్ పై విపరీతంగా ఉందని పార్టీ వర్గాలు చెప్పుకొచ్చాయి. ఇక తాజాగా కవితకు బెయిల్ రావడంతో.. అందరి చూపు కేసీఆర్ వైపు చూస్తోంది. ఇన్నాళ్లు బాధను దిగమింగుతూ రోజులు గడుపుతున్న ఆయనకు కవిత బయటికి రావడం ఊరటనివ్వనుంది.

**మౌనం వ్యూహమేనా..!**

కేసీఆర్ అంటే ఎవరికీ అందని రాజకీయాలకు పెట్టింది పేరు. ఆయన ఎత్తుగడలు ఊహించడం ఎవరికీ సాధ్యం కాదనేది టాక్. నిజానికి గత కొద్ది రోజులుగా సీఎం కేసీఆర్ వ్యూహాత్మక ఎన్నికల ప్రణాళికలో నిమగ్నమై ఉన్నారన్న ప్రచారం జరిగింది. కుటుంబ పరంగా కూడా అనేక మంది కేసీఆర్ పై ఒత్తిడి తెచ్చినా మాట్లాడలేదు. ఢిల్లీ న్యాయ నిపుణులతో తప్ప ఆయన పొలిటికల్ గా ఎవ్వరితో మాట్లడలేదు. ఇటీవల ఫాం హౌజ్‌లో వివిధ వర్గాలను కలిసేవారు. కవిత కు బెయిల్ వచ్చే వరకూ ఎవర్నీ కలువనని భీష్మించుకు కూర్చున్నారు. ఇప్పుడు కవితకు సుప్రీంలో ఊరట లభించడంతో కేసీఆర్ కొత్త రాజకీయాలు మొదలు పెడుతారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.


# బీఆర్ఎస్, కాంగ్రెస్ విజయం



**వైన్ అండ్ డైన్ క్రైంలో భాగస్వామ్యం అద్భుతం**
**కేంద్ర మంత్రి బండి సంజయ్**

ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై బయటకు రావడం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల విజయం అని బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కామెంట్ చేశారు. అలుపెరగని ప్రయత్నాలు చివరికి ఫలించాయంటూ ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితకు బెయిల్ రావడంపై కాంగ్రెస్ పార్టీకి.. న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. ''బీఆర్ఎస్ నాయకురాలు బెయిల్ పై బయటకు వచ్చారు.. కాంగ్రెస్ వ్యక్తి రాజ్యసభకు వెళ్లారు'' అంటూ బండి సంజయ్ కామెంట్ చేశారు. కవిత బెయిల్ కోసం వాదించిన లాయర్ ను.. కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా రాజ్యసభకు పంపిందని.. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడికి మద్దతు ఇవ్వడంలో కేసీఆర్ తన అద్భుతమైన రాజకీయ చతురత చూపించారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వైన్ అండ్ డైన్ క్రైంలో భాగస్వాములు అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అభినందనలు అంటూ బండి పోస్ట్ చేశారు.

# బెయిల్ ఊహించిందే..



**మహేశ్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్...**

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వస్తుందని ఊహించిందే. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే బెయిల్ లభించిందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మొన్నటి వరకు చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్ ను దెబ్బతీయాలని చూశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై బీజేపీకి బీఆర్ఎస్ దాసోహం అయ్యింది. హరీష్, కేటీఆర్ లు ఢిల్లీలో బీజేపీ నేతల చుట్టూ ఆపద మొక్కులు మొక్కారు. బీజేపీ నేతల ఇళ్ల చుట్టూ తిరిగి కాళ్ల మీద పడి కవితకు బెయిల్ తెచ్చుకున్నారు. తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి. దీంతో బీజేపీ, బీఆర్ఎస్ లు కుమ్మక్కు రాజకీయాలు బయటపడ్డాయి. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలవుతుంది. ఇంకా బీజేపీ లో బీఆర్ఎస్ విలీనం ఒక్కటే మిగిలిందని వీడియోను రిలీజ్ చేశారు.


# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | మంగళవారం 27 ఆగస్టు 2024 తెలుగు దినపత్రిక

3 PM పగటి వార్తలు


బతుకమ్మ వచ్చింది..



# కవితక్కకు బెయిల్

## 153 రోజుల తర్వాత విడుదల

**ఢిల్లీ హైకోర్టు తీర్పును తప్పు పట్టిన సుప్రీం కోర్టు.. | మెసేజ్‌లు డిలేట్ చేస్తే తప్పేంటని ప్రశ్న.. | సుదీర్ఘంగా సాగిన వాదనలు**



**కండీషన్స్ అప్లై..**

ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ కోసం రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని సూచించింది. సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. పాస్‌పోర్టును మెజిస్ట్రేట్‌కు సరెండర్ చేయాలని, విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని పేర్కొంది. అలాగే కేసు ట్రయల్‌కు సహకరించాలని, విచారణ వాయిదాల సమయంలో దర్యాప్తు సంస్థలకు సహకరించాలని సూచించింది.

**మూడు అంశాలే కీలకం..**

బెయిల్ మంజూరు చేసే విషయంలో సుప్రీం కోర్టు మూడు అంశాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకుంది. కేసులో సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేయడం, ఈడీ దర్యాప్తును కూడా పూర్తి చేయడం, కవితను మహిళగా కూడా పరిగణించి ఆమెకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది.

**థాంక్యూ సుప్రీం కోర్ట్**

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంపై ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన థాంక్యూ సుప్రీంకోర్టు. ఊరట లభించింది... న్యాయం గెలిచిందంటూ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

**153 రోజులు జైల్లోనే..**

ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ ఈ ఏడాది మార్చి 15న అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆమె తీహార్ జైలులో ఉంటున్నారు. అదే కేసులో ఏప్రిల్ 15న సీబీఐ ఆమెను అరెస్టు చేసింది. కాగా, దాదాపు ఐదు నెలలుగా రిమాండ్ ఖైదీగా జైలులో ఉంటోంది. 153 రోజులు ఆమె జైల్లో ఉండగా.. 11 కేజీల బరువు తగ్గారు.

**రెండు సార్లు అస్వస్థత..**

జైలులో ఉన్న కవిత రెండు సార్లు అస్వస్థతకు గురయ్యారు. మార్చిలో జైలుకు వెళ్లిన కవిత జూలై 16న తొలిసారి అనారోగ్యానికి గురయ్యారు. అప్పుడు ఆమెను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల తర్వాత 18న ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలను జడ్జి కావేరి బవేజా దృష్టికి తీసుకెళ్లారు. కవిత విజ్ఞప్తి మేరకు ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగు పడలేదు. ఇక మళ్లీ ఆగస్టు 22న కవిత అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఢిల్లీ ఎయిమ్స్‌కు కవితను తరలించి.. ఆమె భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు చేశారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి జైలుకు తరలించారు.

జనపదం, బ్యూరో:

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరైంది. ఆమె బెయిల్ పిటిషన్‌పై విచారించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ ద్విసభ్య ధర్మాసనం ఈడీ, సీబీఐ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేసిందని, ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదని, అందుకే కవితకు బెయిల్ మంజూరు చేస్తున్నామని స్పష్టం చేసింది. మహిళగా కూడా పరిగణించాల్సిన అవసరం ఉందని వివరించింది.

**ఆరోపణల్లో వాస్తవం లేదు..**

కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీం కోర్టులో వాదనలు వినిపించారు. ఈడీ కేసులో కవిత 5 నెలలుగా, సీబీఐ కేసులో 4 నెలలుగా జైలులో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసులో 493 మంది సాక్షులను విచారించారని, ఒక మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని తెలిపారు. కవిత మాజీ ఎంపీ అని, ఆమె ఎక్కడికీ వెళ్లరని చెప్పారు. రూ.100 కోట్ల ముడుపుల ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్న ముకుల్ రోహత్గి, కవిత నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సొమ్ము రికవరీ చేయలేదన్నారు. ఇదే కేసులో మనీశ్ సిసోడియాకు



బెయిల్ మంజూరైందని, సిసోడియాకు వర్తించిన నిబంధనలే కవితకూ వర్తిస్తాయని ధర్మాసనానికి వివరించారు.

**డేటా ఫార్మాట్ అసాధారణం**

ఈడీ తరపున వాదనలు వినిపించిన ఏఎస్‌జీ, ఎమ్మెల్సీ కవిత తరచూ ఫోన్లు మార్చారని, ఉద్దేశపూర్వకంగానే ఫోన్లలోని డేటాను పూర్తిగా తొలగించారని కోర్టుకు వివరించారు. ఫార్మాట్ చేసిన ఫోన్లను ఇంట్లో పని మనుషులకు ఇచ్చారని పేర్కొన్నారు. ఫోన్‌లోని సందేశాలను తొలగిస్తే తప్పేంటని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించగా, మెసేజ్‌లను కాదు, పూర్తిగా డేటాను ఫార్మాట్ చేశారని, సెల్‌ఫోన్ డేటాను పూర్తిగా ఫార్మాట్ చేయడం అసాధారణమని వివరించారు.



## పీఎంఎల్ఏ లోని సెక్షన్ 45 అర్హులు..

మనీల్యాండరింగ్ చట్టం(పీఎంఎల్ఏ)లోని సెక్షన్ 45 ప్రకారం .. బెయిల్‌కు కవిత అర్హురాలు అని ధర్మాసనం తెలిపింది. జస్టిస్ బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పును ఇచ్చింది. లిక్కర్ కేసులో దర్యాప్తు ముగిసిందని, కానీ విచారణ ముగిసేందుకు చాలా సమయం పడుతుందని ధర్మాసనం పేర్కొన్నది. దర్యాప్తు పూర్తి అయ్యిందని, ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారని, అప్పీల్ చేసుకున్న వ్యక్తిని కస్టడీలో ఉంచాల్సిన అవసరం లేదని, ఎమ్మెల్సీ కవిత 5 నెలలుగా జైలులో ఉన్నారని, కానీ ఈ కేసు విచారణ సమీప భవిష్యత్తులో పూర్తి అయ్యేలా కనిపించడంలేదని, అనేక కేసుల్లో తీర్పు ఇచ్చిన తరహాలో.. విచారణ సమయంలో కస్టడీలో ఉంచడం శిక్షగా మారకూడదని సుప్రీంకోర్టు వెల్లడించింది. పీఎంఎల్ఏ లోని సెక్షన్ 45 ప్రకారం ఓ మహిళగా ప్రత్యేక లబ్ధి పొందేందుకు ఎమ్మెల్సీ కవిత అర్హురాలు అని కోర్టు తెలిపింది. 45(1) ప్రొవిజన్ మహిళలకు ప్రత్యేక అవకాశాన్ని ఇస్తుందని కోర్టు స్పష్టం చేసింది. కవిత బెయిల్ పిటిషన్ కేసులో.. ఢిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. పీఎంఎల్ఏ కింద చదువుకున్న, ఆధునిక మహిళకు బెయిల్ ఇవ్వడం కుదరని ఢిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సుప్రీం తీవ్రంగా ఖండించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను చట్టంగా అనుమతించలేమని, చదువుకున్న మహిళలకు బెయిల్ ఇవ్వకుండా అడ్డుకోవడం సరికాదని, ఎంపీ అయినా, సాధారణ వ్యక్తి అయినా.. న్యాయం ఒకే విధంగా ఉండాలని సుప్రీంకోర్టు చెప్పింది. పీఎంఎల్ఏ చట్టం విషయంలో హైకోర్టు జడ్జి తప్పుగా వ్యాఖ్యలు చేసినట్లు సుప్రీం కోర్టు పేర్కొన్నది.